చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు ‘మండవ’ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా శ్రమించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, క్షేత్రస్థాయిలో కృషిచేసిన నాయకులకు ప్రత్యేకంగా కార్యకర్తలకు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ఫలితాలు దేశంలో కొత్త ఆలోచనలకు మరో మలుపు లాంటిదని, తెలుగు రాష్ట్రాలు ప్రగతిపథంలో పయనించి సుఖసంతోషాలతో వెలుగొందాలని ఆయన ఆకాంక్షించారు. అభివృద్ధిలో పోటీపడుతూ ఉభయ రాష్ట్రాలు దేశంలో ప్రగతి సాధించాలని కోరుకుంటున్నానని మండవ వెంకటేశ్వర్‌రావు వెల్లడించారు.

ఉద్యోగుల చూపు బదిలీల వైపు!







- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, అధికారులు
- ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు
- సొంత టీమ్‌ల ఏర్పాటుపై దృష్టిపెట్టిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు

నిజామాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ఉద్యోగుల చూపంతా ప్రభుత్వం తీసుకునే బదిలీల నిర్ణయం పైనే ఉంది. ఉద్యోగి నుంచి అధికారుల వరకు బదిలీ ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందనే సమాచారం ఉండటంతో ఉద్యోగులు వేచి చూస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారుల నుంచి మండలస్థాయి అధికారుల వరకు బదిలీల్లో అవకాశం ఇవ్వనుండటంతో ఎవరికి వారే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీలు చేపడితే తమకు నచ్చిన ప్రాంతాలకు వెళ్లేందుకు జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు సిద్ధమవుతున్నారు. భారీ ఎత్తున నేతలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ద్వారా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ దఫా బదిలీ అయితే మూడేళ్ల పాటు ఒకేదగ్గర పనిచేసేందుకు అవకాశం ఉండటంతో తమ పిల్లల చదువులతో పాటు తమకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర రాజధాని, చుట్టుపక్కల ఉన్న జిల్లాలకు వెళ్లేందుకు ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. బదిలీ కోసం ఎంత ఖర్చైనా చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నేటితో ముగియనున్న ఎన్నికల కోడ్

పార్లమెంట్ ఎన్నికల కోడ్ గురువారంతో ముగియనుంది. కోడ్ ముగియగానే భారీ ఎత్తున అధికారులు, ఉద్యోగుల బదిలీలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్ర స్థాయి ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు జిల్లా ఎస్పీలు, కలెక్టర్లను బదిలీ చేయనున్నారు. వీరితో పాటు జిల్లాల్లోని అన్ని శాఖల్లో పనిచేస్తున్న జిల్లాస్థాయి అధికారులు, డివిజన్ అధికారులు, మండల అధికారులు ఎక్కువ స్థాయిలో బదిలీలు కానున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో జోన్-1, మల్టీ జోన్-1 పరిధిలో మూడేళ్లు ఒకే జిల్లాలో పనిచేసిన అధికారులు ఎక్కువ మొత్తంలో తమ సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారు. అధికారులతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీలు కూడా జరిగే అవకాశం ఉండటంతో ఎక్కువ మంది ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటుతుండటం తమకు ప్రత్యేక టీమ్‌ను కూడా జిల్లాలో, రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఇతర కారణాలతో పనిచేస్తున్న అధికారులు కూడా ఈ బదిలీల్లోనే ఉపయోగించుకొని తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పదోన్నతులు వచ్చే వారితో పాటు ఇప్పటికే పదోన్నతులు పొందిన వారు ఎక్కువ మొత్తంలో ఈ బదిలీలను ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎస్సైలు, సీఐలతో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలు ఎక్కువ మొత్తంలో బదిలీ అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు జారీ చేయగానే దరఖాస్తు చేసుకొని వెళ్లేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. కొంత మంది అధికారులు, ఉద్యోగులుఅధికార పార్టీ ప్రజాప్రతినిధుల ద్వారా పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతల ద్వారా మరికొంతమంది అధికారులు బదిలీ కోసం పైరవీలు కొనసాగిస్తున్నారు. కొంత మంది ఉద్యోగులు తమ సంఘాల ద్వారా ప్రయత్నాలు చేస్తుండగా మరికొంత మంది శాఖ కార్యదర్శుల ద్వారా బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారు. తాము ఏ జిల్లాకు వెళ్లాలో భావిస్తున్నారో ఆ జిల్లా ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సు లేఖలను తీసుకుంటూ బదిలీ కోసం ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొంత మంది హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాలతో పాటు చుట్టుపక్కల ఉన్న జిల్లాలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. తమ కుటుంబానికి చెందిన పిల్లల చదువులతో పాటు వైద్య ఆరోగ్య సదుపాయాలు ఎక్కువగా నగర ప్రాంతంలోనే ఉండ టంతో వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఖర్చైనా పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. బదిలీల ద్వారా 30 నుంచి 40 శాతం మంది ఉద్యోగులు, అధికారులకే అవకాశం ఇవ్వనుండటంతో పోటీ ఎక్కువగా ఉండటం వల్ల గట్టి ప్రయత్నాలను అధికారులు కొనసాగిస్తున్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన అధికారులు కూడా జిల్లాకు వచ్చేందుకు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా బదిలీలు ఉండటంతో ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

చురుకైన అధికారులపై ప్రజాప్రతినిధుల దృష్టి

తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు చురుకైన అధికారులపై ప్రజాప్రతినిధులు దృష్టి పెడుతున్నారు. ప్రత్యేక టీమ్‌ను మండలాల వారీగా తయారు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభు త్వం కొత్తగా ఏర్పాటు కావడం ఐదేళ్ల పాటు పనులు చేయనుండటంతో తహసీల్దార్, ఎస్సై, సీఐ, ఎంపీడీవో, ఎంపీవో, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఏఈలు, వ్యవసాయ శాఖ ఏవో, ఉద్యానవన శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులపై నజర్ పెడుతున్నారు. నాలుగేళ్ల పాటు కీలకమైన పనులు చేసే అధికారులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎక్కువ మొత్తంలో నిధులు రానుండటంతో అనుకూలమైన వారిని తెచ్చుకునేందుకు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఉన్నచోటే కాకుండా నియోజకవర్గ ఇన్‌చార్జిలు కూడా అధికారులపై దృష్టి పెట్టి ముందస్తుగా నేతల దృష్టికి తీసుకువెళ్తున్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో తమకు దగ్గరగా ఉన్న అధికారులను తెచ్చుకునేందుకు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం బదిలీలపై ఉత్తర్వులు ఇవ్వగానే సిఫారసు లేఖలు ఇచ్చి ఉద్యోగులను తెచ్చుకునేందుకు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు, అధికారులు బదిలీలు అయ్యే అవకాశం ఉంది.

బీఆర్‌ఎస్‌లో అంతర్మథనం!



> నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ మూడో స్థానంలో నిలవడంతో ఆ పార్టీ అంతర్మథనంలో పడింది. లోక్‌సభ ఎన్నికల్లో హోరాహోరీగా ప్రచారం నిర్వహించి గెలుపు ధీమాతో కనిపించిన బీఆర్ఎస్‌కు భారీ షాకే తగిలింది. ఫలితాలు భిన్నంగా రావడంతో నేతలు సమాలోచనలు చేస్తున్నారు. జిల్లాలో మోదీ మానియా నడిచిందంటూ చర్చించుకుంటున్నారు.

- బీఆర్ఎస్ శ్రేణులను నిరాశపరిచిన ఎంపీ ఎన్నికల ఫలితాలు
- అతితక్కువగా ఓట్లు సాధించడంతో అయోమయంలో నేతలు
- గణనీయంగా తగ్గిపోయిన పార్టీ ఓటుబ్యాంకు
- స్థానిక సంస్థల్లో పోటీపై ఇప్పటినుంచే పార్టీ క్యాడర్‌లో చర్చలు

నిజామాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో నిరాశనే మిగిల్చాయి. శాసనసభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించినా పార్లమెంట్ ఎన్నికల్లో ఒకేసారి తగ్గిపోవడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు అంతర్మథనంలో పడ్డారు. ఒకేసారి ఓటు బ్యాంక్ భారీగా తగ్గడం వల్ల వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో చాలా నియోజకవర్గాల్లో నామమాత్రం ఓట్లు రావడంతో వారు జీర్ణించుకోవడం లేదు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బీఆర్ఎస్ నేతలు ఉండటం, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నా.. ఫలితం మాత్రం లేకుండా పోవడంతో క్యాడర్‌లో చర్చించుకుంటున్నారు. వచ్చే ఆరు నెలల్లోపే అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ఈ ప్రభావం తమపై పారుతుందని భావిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఓట్ల శాతంపై సమీక్షిస్తూ ముందుకు పోయేందుకు ప్రయత్నిస్తున్నారు.

తగ్గిన పార్టీ ప్రభావం

శాసనసభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ప్రభావం తగ్గిపోయింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా మూడింటిలో బీఆర్ఎస్ గెలుచుకుంది. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో రెండింటిని కాంగ్రెస్, రెండింటిని బీజేపీ గెలుచుకుంది. తదనంతరం జరిగిన పరిణామాలతో పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు పార్టీ పెద్దలు పూర్తిస్థాయిలో నజర్ పెట్టకపోవడంతో కిందిస్థాయి నేతలు కాంగ్రెస్, బీజేపీలో చేరారు. ముఖ్యంగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరగా కొంత మంది బీజేపీని ఆశ్రయించారు. గత శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు 4లక్షల 17 వేల 315 ఓట్లు వచ్చాయి. మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా గెలుపొందారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం చాలా తక్కువగా లక్షా 2వేల 406 ఓట్లు మాత్రమే వచ్చాయి. గత శాసనసభ ఎన్నికలు జరిగి ఆరు నెలలే గడిచినా. మూడోస్థానానికి పడిపోయింది. శాసనసభ ఎన్నికల్లో మూడోస్థానంలో ఉన్న బీజేపీ ఈ ఎన్నికల్లో మొదటి స్థానంకు వచ్చి సీటు కైవసం చేసుకుంది. శాసనసభ ఎన్నికల సమయంలో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో బీజేపీకి 3లక్షల 65వేల 374 ఓట్లు రాగా, ఈ ఎన్నికల్లో 5లక్షల 92వేల 318 ఓట్లు వచ్చాయి. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏడు నియోజకవర్గాల్లో 4లక్షల 8వేల 135 ఓట్లు రాగా, ఈ ఎన్నికల్లో 4లక్షల 83వేల077ఓట్లు వచ్చాయి. శాసనసభ కంటే మెరుగైన ఫలితాలను కాంగ్రెస్ సాధించింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మాత్రం అతితక్కువగా ఓట్లు వచ్చాయి.

మూడోస్థానానికి పరిమితం

పార్లమెంట్‌లో జరిగిన ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 22,590, బోధన్‌లో 7,742, కోరుట్లలో 19,595, నిజామాబాద్ అర్బన్‌లో 7,124, ఆర్మూర్‌లో 8,312, బాల్కొండలో 19,643, జగిత్యాలలో 16,194 ఓట్లు వచ్చాయి. మొత్తం ఓట్లను పరిశీలిస్తే అన్ని నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పరిమితమైంది. ఇప్పటి వరకు స్థానిక సంస్థల పదవులపై ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్న పార్టీ నేతలు ఈ ఫలితాలతో నిరాశలో ఉన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే వరకు క్యాడర్‌తో సమావేశాలు నిర్వహించి మనోధైర్యాన్ని నింపితేనే ఎక్కువ మంది పనిచేసే అవకాశం కనిపిస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుండటంతో కొంత మంది పార్టీ నేతలు కూడా భవిష్యత్తుపై ఆలోచనలో పడ్డారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్వింద్

కాంగ్రెస్ మత రాజకీయాలు చేసింది

- సుదర్శన్‌రెడ్డి రాజకీయ అవకాశవాది
- ముస్లింలే కాంగ్రెస్‌కు ఓటు వేశారు
- ఎంపీ ధర్మపురి అర్వింద్

పెద్దబజార్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలు చేసిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రలను ఇందూరు ప్రజలు తిప్పికొట్టారన్నారు. ప్రధాని మోదీతో పాటు తనపైన విశ్వాసంతో ప్రజలు మరోసారి గెలిపించారన్నారు. ప్రజలంతా తన వైపు నిలిచారన్నారు. పసుపు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పునరుద్ఘాటించారు. బోధన్‌లోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రాజకీయ అవకాశవాది అని అర్వింద్ విమర్శించారు. సొంతంగా పరిశ్రమలు, ఇథనాల్ ఫ్యాక్టరీలు స్థాపించి వ్యాపారాలు చేస్తున్నాడని.. కానీ ప్రజలకు మాత్రం మేలు చేయడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మత రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతోందన్నారు. అందుకే ముస్లింలు తప్ప.. ఇతర వర్గాలు కాంగ్రెస్‌కు ఓటు వేయలేదన్నారు. బీఆర్ఎస్ దిగిపోవడానికి ముస్లింల ఓట్లే కారణమని, దీనిపై కేసీఆర్, కేటీఆర్ ఆలోచించాలని సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, నాయకులు పల్లె గంగారెడ్డి, గద్దెభూమన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, పం చరెడ్డి ప్రవళిక, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కలిసి పనిచేశాయి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


నిజామాబాద్ అర్బన్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పనిచేశాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా వస్తున్న క్రేజ్‌ను చూసి ఎక్కడ ఓడిపోతామోనని బయటపడి ఆ రెండు పార్టీలు రహస్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని అన్నారు. ఆ రెండు పార్టీలు ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని అన్నారు. ఇందుకు నిదర్శనమే పెద్దనోట్ల రద్దు విషయంలో బీజేపీకి, బీఆర్ఎస్ మద్దతు పలకడమని మోదీ తీసుకొచ్చిన అనేక చట్టాలకు బహిరంగంగా, తెరవెనుక మద్దతు పలికారని అన్నారు. గత ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న అర్వింద్ పసుపు బోర్డు పేరు చెప్పి మాయ చేశారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, రాష్ట్ర నాయకులు శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

బీఆర్ఎస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలు

డిచ్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయలు చేయడం వల్లే కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఓటమి చెందారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకూ ఎండల తీవ్రత లెక్క చేయకుండా కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ధన్యవాదలు తెలిపారు. ఎన్నికల్లో రెండు కారణాలతో ఓటమి జరిగిందన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ నామామాత్రంగా పాల్గొని కేసీఆర్ తన కుటుంబాన్ని, కవిత అవినీతిని కాపాడుకోవడానికి బీజేపీని గెలిపించుకునేందుకు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈకారణంతోనే జీవన్‌రెడ్డి ఓటమి పాలయ్యారన్నారు. కాంగ్రెస్‌కు ఓటుశాతం పెరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు శేఖర్ గౌడ్, నవీన్ గౌడ్, ముప్ప గంగారెడ్డి పాల్గొన్నారు.



పాతకుస్తాపూర్‌లో సగం వరకు తేలిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం

గంగమ్మ ఒడి నుంచి బయటకు..

- ఎస్సారెస్పీ నీటిమట్టం తగ్గడంతో సగం వరకు తేలిన ఆలయం

మండలంలోని పాతకుస్తాపూర్ రామలింగేశ్వర ఆలయ సగం వరకు బయటపడింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో ఆలయ ముఖద్వారం సగం వరకు తేలింది. దీంతో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఆలయ గోపురానికి సున్నం వేసి పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు నీటిమట్టం మరింత తగ్గితే ఆలయం పూర్తిగా తేలే అవకాశం ఉంది.

– డొంకేశ్వర్

ప్రమాదాలకు నిలయం మోస్రా రహదారి

● రోడ్డుకు ఇరువైపులా గుంతలు ● వాహన చోదకులకు ఇబ్బందులు ● పట్టి పట్టనట్టుగా సంబంధిత అధికారులు

మోస్రా,జూన్5: మండల కేంద్రం శివారులోని మోస్రా, చందూర్, బోధన్ మూడుదారుల కూడలి గుంతమయంగా మారింది. మోస్రా గ్రామం నుండి చింతకుంట ఎక్స్ రోడ్డు మూడు దారుల కూడలి దాదాపు మూడు కిలో మీటర్లు ప్రయాణంలో పదుల సంఖ్యలో గుంతలు ఉన్నాయి. గుంతల వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ కూడలి వద్ద ప్రమాదం జరిగితే ఇబ్బందికరంగా మారుతుంది. సంబంధిత అధికారులు మాత్రం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బోధన్ రూరల్‌కు వర్నికి ఇదే బోర్డర్‌గా ఉంటుంది. అందుకే ఎవరి పరిధిలోకి వస్తుందో చెప్పటానికి జనాలకు అర్థం కాక నానా తిప్పలు పడుతున్నారు. అదే విధంగా మోస్రా నుండి నిజామాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో అలీసాగర్, కుర్నాపల్లి, కొత్తపేట్ ఎక్స్ రోడ్డు వద్ద మూడు రోడ్డుల కూడలి వద్ద ఎలాంటి ప్రమాదం జరిగిన ఏ పోలీసుల మండల పరిధికి వస్తుందో అనే అయోమయంలో ఉంటారు ప్రజలు, ఇక్కడ నిజామాబాద్ రూరల్ మండలం, మోస్రా మండలం కొంచెం దూరంలో అటు ఇటుగా ప్రమాదం జరిగినా నాపరిధి కాదు అంటారు.అధికారులు ప్రమాదాలు జరగకుడా ఉండాలన్న ఇక్కడ రోడ్డు అంటే అది రోడ్డు కాదు ఇక్కడ చెప్పలేనన్నీ ప్రమాదాలు జరిగాయి. కొన్ని ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. మరికిందరు విగతజీవుల్లా బతుకుతున్నారు. మోస్రా బస్టాండ్ సమీపంలో బాన్సువాడ, నిజామాబాద్ ప్రధాన రహ దారిని అనుకుని ఉన్న కొన్ని హోటళ్లకు వచ్చే వారు వాహనాలు రోడ్డుపై నిలపడం వల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది. అదే విధంగా ఇక్కడ మూడు దారుల కూడలి ఒకటి మోస్రా గ్రామంలోకి వెళ్లే ప్రదాన రోడ్డు ఇటు నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారి ఇక్కడ ఎటువంటి రోడ్డు మలుపు సూచిక బోర్డు గుర్తులు కాని స్పీడ్ బ్రేకర్‌లు కాని ఏర్పాటు చేయక తరుచు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి.అదే విధంగా గ్రామ శివారులోని సాయిబాబా ఆలయం వద్ద మూల మలుపు ప్రమాదకరంగా ఉందని గత నెలలో ఓ వ్యక్తి ప్రాణాలు సైతం కోల్పోయాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో మాజీ సర్పంచ్ సుమలత రాంరెడ్డిరోడ్డు రవాణాశాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసిన నేటి వరకు చర్యలు తీసుకోలేదంటే అతిశయోశక్తి కలగకమానదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రేడియంతో కూడిన మూల మలుపు వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతల మయంగా మారిన వర్ని-మోస్రా రోడ్డు


గుంతల మయంగా మారిన రోడ్డు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



మోస్రా, గోపూర్ గ్రామ శివారు ముగింపు వరకు నిజామాబాద్ - బాన్సువాడ ప్రధాన రహదారిపై ఉన్న రోడ్డు గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ఈ రహదారి పై ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురవు తున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- శ్రీనివాస్, స్థానికుడు, మోస్రా

అటవీ శాఖ అధికారుల అనుమతి కోసం అర్జీ

అటవీ శాఖ అధికారుల అనుమతి కొరకు అర్జి పెట్టాము. వారి అనుమతి వచ్చిన వెంటనే పూర్తి పనులు చే స్తాం . వాహనదారులు ఇబ్బందులు పడకుండా గుంతల కు మరమ్మతులు చేపడతాం.

- జియాన్, ఆర్‌అండ్‌బీ ఏఈ, మోస్రా

ఉపాధి కూలీలకు స్వీట్ల పంపిణీ


కూలీలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్5: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో బుధవారం ఉపాధి హామీ కూలీలకు బీజేపీ నాయకులు సిర్ప సుదర్శన్ స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఎంపీ స్థానాన్ని గెలిపించినందుకు ఉపాధి కూలీలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయోత్సవ సంబరాలు నిర్వహించి అనంతరం ఉపాధి కూలీలకు స్వీట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులున్నారు.

జిల్లా అంతటా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు


ఆర్మూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌లు


మొక్కలను నాటుతున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్5: పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సాయి ఆదర్శ మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సాయి ఆదర్శ యువతి మండలి ఆధ్వర్యంలో మండలంలోని పలు వార్డులలోని ఇంటింటికి నిమ్మ, జామ, మామిడి మొక్కలు పంపిణీ చేశారు. పలు చోట్ల స్వచ్ఛందంగా సంఘ సభ్యులు పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెత్తను తొలగించారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కమల,అక్షయ్, ఖాజాబీ,రణవీర్, అనిఫా,గీత, సైదవ్వ, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్:ప్రతీఒక్కరు పర్యవరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం అన్నారు. బుధవారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పర్యా వరణాన్ని కాపాడడానికి మొక్కలు పెంచడంతో పాటు అన్ని రకాల జీవ జాతులను రక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పాస్టిక్ రహిత సమాజా న్ని నిర్మించినప్పుడే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుంద న్నారు. ఈ సందర్భంగా పర్యవరణ పరిరక్షణ కొరకు అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేష్, ప్ర శాంత్, నరేష్, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో తెలంగాణ సాం ఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థినిలు పర్యావరణాన్ని కాపాడాలని పాటలు పడుతూ ప్రధానకూ డళ్ల వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం పర్యావరణంపై ప్రజ లకు అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.ధనవేణి, వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ముప్కాల్: ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఏపీవో ఇందిరా అన్నారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య,పంచాయతీకార్యదర్శి కూలీలు పాల్గొన్నారు.

రుద్రూరు:పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్రూరు మండలంలోని రాయకూర్ గ్రామ పంచాయితీలోని ఫారంపాండు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మనోహర్, గ్రామ కార్యదర్శి, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయాలి

నవీపేట,జూన్5: ప్రస్తుత వర్షకాల సీజన్‌లో హరితహారాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో నాగనాథ్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో 3,700 చొప్పున మొక్కలు నాటాలని, మండలంలో 1,18,400 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాలలు, ఆసుపత్రుల ఆవరణలతో పాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో నాందేవ్, తదితరులున్నారు.

జనసైనికుల సంబరాలు

ఆర్మూర్‌టౌన్,జూన్5: పట్టణంలో జనసేన పార్టీ సైనికులు బుధ వారం సంబరాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ళ కల నెరవేర డంతో పవన్ కల్యాణ్ అభిమానులు పట్టణంలోని జంబిహన్మాన్ ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి మొ క్కులు తీర్చుకున్నారు. పోటీ చేసిన 21స్థానాల్లో గెలుపొందడంతో సం తోషాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో జనసేన అభిమానులు జంబికుశల్,కళ్యాణ్,శ్రీధర్,శ్రీకాంత్,రఘువరన్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

ముప్కాల్, జూన్5: రైతులకు నకిలీలు విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాల్కొండ వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంయుక్తంగా బాల్కొండలోని ఫర్టిలైజర్ షాప్‌లను తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు రశీదు తప్పనిసరి ఇవ్వాలని అన్నారు. డీలర్లు సంబంధిత స్టాక్ రిజిష్టర్‌లు బిల్లులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు లైసెన్స్ వద్ద గల డీలర్ల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంటల డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎఎస్సై శంకర్‌లు పాల్గొన్నారు.

నందిగామలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నవీపేట,జూన్5: మండలంలోని నందిగామలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు బుధవారం బీఎస్ఎన్ఎల్ టెక్నికల్ అధికారి శేఖర్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన జరిపారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్‌కు చెందిన సిగ్నల్స్ రాకపోవడంతో రేషన్ సరుకుల సరఫరా, పింఛన్‌దారులు, ఉపాధి హామీలకు చెల్లింపుల విషయంలో ఇబ్బందులు జరుగుతున్నాయని ఈ నెల 1న జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు సంజీవ్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులు గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావణ్య కిషన్ రావు తదితరులున్నారు.

పీఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ

కోటగిరి,జూన్5: కోటగిరి మండలంలోని ఎత్తొండ, కొత్తపల్లి గ్రామాలలో పీఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్‌లను బుధవారం మండల ఆరోగ్య విస్తీరణ అధికారి గోవర్ధన్ తనిఖీ చేశారు. క్లినిక్‌లలో ప్రథమ చికిత్స అందించే సిబ్బంది వివరాలు సేకరించారు. క్లినిక్‌ల పరిసరాలను పరిశీలించారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్‌ల సర్టిఫికేట్‌లు, ఆధార్ కార్డులు, ఫోటోలను పరిశీలించారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని సూచించారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమీల, సరోజ, లలిత తదితరులు పాల్గొన్నారు.


నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలి

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


అమెరికాలో ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూన్5: ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు తమవంతు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. ఎమ్మె ల్యే రాకేష్‌రెడ్డి అమెరికా పర్యాటనలో భాగంగా బుధవారం ప్రవాస భారతీ యులతో కలిసిడల్లాస్‌లోని శ్రీ వెంకట సత్యనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఎన్ ఆర్ఐలు పెట్టుబడులు పెడితే ప్రభుత్వం ప్రొత్సహం అందిస్తుందన్నారు. రైతులకు సంబంధించిన ఫ్రుడ్‌ప్రాసెస్ యూనిట్‌లు ఏర్పాట్లు చేస్తే అన్ని విధాలుగా సహకారం అందిస్తానని రాకేష్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

శెట్‌పల్లిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


శెట్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మోర్తాడ్, జూన్5: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో 2007-08 విద్యసం వత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనాటి పదో తరగతిలో విద్యనభ్యాసించిన విద్యార్థిని, విద్యార్థులు అనాటి తిపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రస్తుతం ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడిన తాము తమ కుటుంబ వివరాలను అప్యాయంగా ఒకరినొకరు అడిగితెలుసుకున్నారు. విద్యబుద్దులు నేర్పిన గు రువులను గౌరవించి పూలమాలలు, శాలువతో సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పురాణిపేట్‌లో ఉరేసుకొని ఒకరి మృతి


మృతుడు నర్సయ్య

భీమ్‌గల్‌రూరల్, మే5: భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్‌లో బుధవారం ఉదయం గ్రామంలోని ప్రధాన కూడలివద్ద ఉన్న చెట్టుకు అదే గ్రామానికి చెందిన మల్లెల నర్సయ్య వయస్సు 76 సంవత్సరాల వ్యక్తి ఉరేసుకొని చనిపోయాడు. భీమ్‌గల్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం మల్లె ల నర్సయ్య గత కొద్ది కాలంగా మానసిక పరి స్థి తిసరిగ్గా లేకపోవడంతో చనిపోయినట్లు తెలిపా రు. మృతినిభార్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

● జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

ఇందల్వాయి, జూన్ 5: రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో బుధవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. దుకాణంలో ఉన్న ఎరువుల నిల్వలను, ఆన్‌లైన్‌లో ఉన్న నిల్వలు సమానంగా ఉన్నాయాల లేవా అని పరిశీలించారు. ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఇందల్వాయి, ఎల్లారెడ్డిపల్లి, నల్లవెల్లి సొసైటీలోగల నిల్వలను తనిఖీ చేశారు. విత్తనాలు అమ్మే ప్రతి దుకాణంలో రైతులు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల ఇంచార్జి వ్యవసాయ అధికారి రాంబాబు, ఏఈవోలు శ్రీహరి, ప్రకాశ్‌గౌడ్, సతీష్ పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 5: నగర శివారులోని నాగారంలోగల మైనార్టీ గురుకుల పాఠశాల బాలుర-1లో ఇంగ్లిష్ మీడియంలో 5, 6, 7, 8 తరగతులకు డబుల్ సెక్షన్లు మంజూరయ్యాయని మైనార్టీ, నాన్ మైనార్టీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కిరణ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందే విద్యార్థులు, తల్లిదండ్రులు 9010456538, 9603399705 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ కార్యవర్గం

నిజామాబాద్ అర్బన్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఫలితాలపై హర్షం వ్యక్తం చేస్తూ టీపీసీసీ కార్యవర్గం బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నేతలు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. గతంలో మూడు పార్లమెంట్ స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్ సీఎం నాయకత్వంలో 8 స్థానాలకు చేరుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించి 8 సీట్లు గెలిపించడంలో కీలకపాత్ర పోషించారని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఈరవత్రి అనిల్ పాల్గొన్నారు.

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ప్రత్యేక డ్రైవ్

నిజామాబాద్ అర్బన్, జూన్ 5: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ వివిధ దేశాలలో నర్సుల కోసం విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుందని ఈ అవకాశాన్ని జిల్లాకు చెందినవారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జెర్మనీ దేశాల వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలలో అర్హత కలిగిన నర్సులు, ఇతర ఆరోగ్య సంరక్షణ కార్మికులకు డిమాండ్ ఉందని సురక్షితమైన, చట్టబద్ధమైన మార్గాల ద్వారా అర్హత కలిగిన అభ్యర్థులకు శిక్షణ మరియు భాషా నైపుణ్యాలు అందించడానికి ఈ కంపెనీ భాగస్వామ్యంతో వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుందని కావున జిల్లాలోని ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు టామ్‌కామ్.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ లేదా 9908830438, 8919047600 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

10లోపు పనులను పూర్తి చేయాలి

ధర్పల్లి, జూన్ 5: ఈ నెల 10లోపు అమ్మఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో బాలకృష్ణ ఆదేశించారు. బుధవారం మండలంలోని వాడి గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద జరుగుతున్న పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పాఠశాలల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.కోటిమేరా మంజూరు అయ్యాయని పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. 10లోపు పనులు పూర్తి చేయాలని ఆయన సంబంధిత ఏజెన్సీలకు సూచించారు.

టీడీపీ నాయకుల సంబరాలు

మోపాల్, జూన్ 5: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో నగర సమీపంలో ఉన్న మాధవనగర్ సాయిబాబా ఆలయంలో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు సంతోషకరమన్నారు. ఈ సంబరాల్లో మాధవనగర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, టీడీపీ నాయకులు వినోద్‌కుమార్, నర్సింహారావు, ఎన్.తరుణ్, సీహెచ్ శ్రీనివాస్‌రావు, ఎం.రామకృష్ణ, కమ్మ సంఘం పెద్దలు, మాధవనగర్ గ్రామస్తులు సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు, వినోద్‌కుమార్‌లు మాట్లాడుతూ వైఎస్ జగన్ నియంతృత్వ పాలనతోనే ఆ ప్రాంత ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఆంధ్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని నమ్మకంతోనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. కొబ్బరికాయలు కొట్టిన అనంతరం నాయకులు స్వీట్లను పంచిపెట్టారు. తెలంగాణలో మళ్లీ తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం రానుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

'నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 5: జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తూ అందులో ప్రతిభ చూపిన వారికే అడ్మిషన్లు ఇస్తున్నారని ప్రతిభలేని విద్యార్థులకు అడ్మిషన్లు లేవని చెబుతున్నారని విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్ల కొరకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు నిర్వహించవద్దనే నిబంధనలు ఉన్నా వాటిని ఉల్లంఘిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందజేశారు. అడ్మిషన్ల పేరుతో అదేవిధంగా లాటరీ పద్ధతిలో కొన్ని పాఠశాలలు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని కొన్ని పాఠశాలలు డొనేషన్లు తీసుకుంటున్నారని కావున అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యదర్శి జ్వాలా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మేఘన, సంజన, హర్షిత, రుచిత తదితరులు పాల్గొన్నారు.

లో లెవల్ వంతెనతో రాకపోకలకు ఇక్కట్లు


మంథని- దేగాం గ్రామాల మధ్య వంతెనపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)


మిర్దాపల్లి-దేగాం గ్రామాల మధ్య వంతెనపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)

● నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందులు

● పట్టించుకోని సంబంధిత అధికారులు

ఆర్మూర్‌రూరల్, జూన్ 5: మండలంలోని మంథని, దేగాం గ్రామాల మధ్య లో లెవల్ వంతెనతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వర్షాలు కురిస్తే లోలెవల్ వంతెనపై నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ఈ రోడ్డు వెంబడి ప్రయాణం మానుకోవాల్సి వస్తుంది. వర్షాకాలంలో లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రమాదాలు జరిగే అస్కారం ఉంది. పరిస్థితి ప్రమాదకరంగా ఉందని తెలిసిన అధికారులు, పాలకులు పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా మిర్దాపల్లి, దేగాం గ్రామాల మధ్య దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరడమే గాకుండా ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన పై నుంచి కూడా వర్షాకాలంలో వచ్చే వరదనీరు ప్రవహించి రాకపోకలకు అసౌకర్యం ఏర్పడుతుంది. ఈ వాగు ద్వారా మిర్దాపల్లి, మంథని, దేగాం గ్రామాల మీదుగా ప్రవహించి శ్రీరాం సాగర్ బ్యాక్‌వాటర్‌లో కలుస్తుంది. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో ప్రవహం ఉధృతి పెరిగి బ్రిడ్జిల పై నుంచి వరదనీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో మచ్చర్ల, దేగాం గ్రామస్థులు ఆర్మూర్ వెళ్ళడానికి ఆలూర్ మీదుగా వెళ్ళాల్సి వస్తుంది.

నూతన బ్రిడ్జిలు నిర్మించేదెప్పుడో..

ఆలూర్ మండలం మిర్దాపల్లి, పిప్రి, మంథని, దేగాం గ్రామాల ప్రజలకు లోలెవల్ వంతెనతో ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా నూతన బ్రిడ్జిని నిర్మించాలని గత కొంత కాలంగా ప్రజలు కోరుతున్నారు. సుమారు రెండేళ్ళ క్రితం మండలంలోని వివిధ గ్రామాలలో లోలెవల్ వంతెన స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించడానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు సర్వే చేపట్టారు. వీటిలో ఆర్మూర్ పట్టణంలోని సుబాష్‌నగర్ వదద, పిప్రి మంథని గ్రామాల మధ్య నూతన బ్రిడ్జిని నిర్మించారు. కానీ అంచన వ్యయం ఎక్కువతున్నాయన్న కారణంతో మిర్దాపల్లి, దేగాం, మంథని దేగాం గ్రామాల మధ్య లోలెవల్ వంతెన స్థానంలో కొత్త బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టలేదు. వర్షాకాలంలో వర్షాలు కురిసి ఈ గ్రామాల ప్రజలకు లోలెవల్ వంతెనలు అసౌకర్యంగా మారనున్నాయి. ప్రభుత్వం నూతన వంతెన నిర్మించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈసీఎస్ సమావేశంలో జీజీహెచ్ వైద్యురాలు

పెద్దబజార్, జూన్ 5: అమెరికాలో ఇటీవల నిర్వహించిన ఈసీఎస్ సమావేశంలో భారత్ తరఫున జిల్లా జనరల్ ఆసుపత్రి సీనియర్ రెసిడెన్సి పాథలాజి వైద్యురాలు ఉమాదేవి పాల్గొన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన 245వ సమావేశంలో పలు అంశాలపై అంతర్జాతీయ నిపుణులతో చర్చించారు. అలాగే తాను పరిశోధించిన రెండు అంశాలను సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవిని బుధవారం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వీపీరావు, డాక్టర్ ఇమ్రాన్‌లు సన్మానించారు. జిల్లా నుంచి అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడం గొప్ప విషయమన్నారు.

ఎంపీ అర్వింద్‌కు సన్మానం

పెద్దబజార్, జూన్ 5: ఎంపీగా గెలుపొందిన అర్వింద్ ధర్మపురికి రుద్రాక్ష మాలతో సన్మానించారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ కంఠేశ్వర్ మండల అధ్యక్షుడు రోషన్‌లాల్‌బోరా అర్వింద్‌కు రుద్రాక్ష మాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో మోదీ, ఇందూరులో ఏడీ అని అన్నారు. ప్రతిపక్షాలకు చెంపచెల్లు పెట్టుగా భారీ మెజార్టీతో రెండవ సారి ఎంపీగా గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు.

పర్యావరణ కాలుష్యంతోనే వ్యాధుల విజృంభణ


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయ అధికారిణి సునీత కుంచాల

పెద్దబజార్, జూన్ 5: పర్యావరణ కాలుష్యంతోనే వ్యాధులు విజృంభిస్తాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. బుధవారం నగరంలోని దుబ్బలోగల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీధుల గుండా తిరుగుతూ పర్యావరణ కాలుష్యం వల్ల కలిగే అనర్థాలపై మనభూమి, మనభవిష్యత్తు, పచ్చని చెట్లు, ప్రగతికి మెట్లు లాంటి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యంతో అనేక అనర్థాలు శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, బ్రాంకైటిస్, ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్, క్యాన్సర్ లాంటి వ్యాధులు విజృంభన జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించినప్పుడే స్వచ్ఛమైన గాలి అంది ఆరోగ్య వంతులుగా మారుతారని అన్నారు. ఉష్ణోగ్రత పెరగడం వల్ల దోమల విజృంభన జరిగి మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడు వాపు, ఫైలేరియా లాంటి వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎక్కడెక్కడ నీటి నిల్వలు ఉన్నాయో వాటిని తొలగిస్తే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపిడమాల్ డాక్టర్ వెంకటేశ్, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, మలేరియా అధికారి సలీమ్, వెంకట్, రవి, నాగరాజు, శ్రీనివాస్, గంగాధర్, శ్రీధర్, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవం..

నిజామాబాద్ లీగల్: ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయఅధికారిణి సునీతకుంచాల హాజరై చెట్లను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటి మానవ మనుగడకు ప్రాణవాయువు ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రాణవాయువు మనుగడకు చెట్లు పెంచడం చాలా ముఖ్యమని పచ్చదనంతో వాతావరణం మార్చుకోవాలని అదేవిధంగా పర్యావరణాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణ నీటివృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి కాలుష్యాన్ని రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, అటవీశాఖ సిబ్బంది, న్యాయసేవా సంస్థ సిబ్బంది పురుషోత్తంగౌడ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అధికారుల ప్రతిజ్ఞ

ధర్పల్లి: మండల కేంద్రంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా అధికారులు బుధవారం ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి తన రోజువారి జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులు తెస్తానని పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యత గురించి నా కుటుంబం, స్నేహితులు, ఇతరులను నిరంతరం ప్రేరేపించడానికి కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎండీవో బాలకృష్ణ, ఏపీవో వినోద, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

సమష్టి కృషితోనే విజయం

ధర్పల్లి, జూన్ 5: మండలంలో బీజేపీ నాయకుల సమష్టి కృషితోనే పార్టీ విజయం సాధించిందని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఎంపీ అర్వింద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో మరో సారి బీజేపీకి మద్దతు తెలిపిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్క గంగారెడ్డి, జె.శ్రీనివాస్, మురళిగౌడ్, గంగాదాసు, నరేష్ పాల్గొన్నారు.

ఎస్సీ న్యాయశాస్త్ర పట్టభద్రుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 5: ఉమ్మడి జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాల న్యాయశాస్త్ర పట్టభద్రులు 2024-25 సంవత్సరానికి గాను న్యాయశాస్త్ర పట్టభద్రుల శిక్షణ కొరకు జూలై 8లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాలకు చెందిన అభ్యర్థులకు 8 సీట్లు మంజూరు అయ్యాయని అభ్యర్థులు బార్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలని తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2లక్షలకు మించకుండా ఉండాలని ఎంపికైన వారికి శిక్షణ కాలం (3) సంవత్సరాలలో నెలకు 3వేల చొప్పున స్టైఫండ్, 50వేల నమోదు రుసుమును రీయంబర్స్‌మెంట్ పద్ధతిన చెల్లించడం జరుగుతుందని, పుస్తకాలు, ఫర్నీచర్ కొనుగోలు చేసేందుకు నిబంధనలకు లోబడి డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. శిక్షణలో పాల్గొనే న్యాయశాస్త్ర పట్టభద్రులు తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 102లో గల జిల్లా షెడ్యూల్ కులాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. జూలై 15న అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు.

క్రికెట్ ఆడుతుండగా యువకుడికి గుండెపోటు

● ఆస్పత్రికి తరలిస్తుండగా మృత్యువాత

ఖిల్లా, జూన్ 5: క్రికెట్ ఆడుతుండగా.. యువకుడికి గుండెపోటు వచ్చి మృత్యువాత పడిన ఘటన జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన విజయ్ (30) అనే యువకుడు ప్రయివేటు సంస్థలో పని చేస్తున్నాడు. బుధవారం స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడేందుకు వినాయక్‌నగర్‌లోని ఓ వెంచర్ వద్దకు వెళ్లాడు. అయితే క్రికెట్ ఆడుతుండగా అకస్మాత్తుగా కుప్పకూలి కింద పడిపోయాడు. తోటి స్నేహితులు విజయ్‌ను చికిత్స నిమిత్తం వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగర నాలుగో టౌన్ ఎస్సై సంజీవ్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య

ఖిల్లా, జూన్ 5: నగరంలోని రెండో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గాజుల్‌పేట్‌కు చెందిన దేరాడి కిరణ్(23) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఎల్.రామ్ తెలిపారు. మృతుడు వర్క్‌ఫ్రం హోంపై ఓ కంపెనీలో పని చేస్తున్నాడని, షేర్ మార్కెట్ ఆడే అలవాటు ఉండడంతో పాటు అయనకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. దీంతో ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటాలని అధికారుల ప్రతిజ్ఞ

మోపాల్, జూన్ 5: రాబోయే రోజుల్లో గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల అభివృద్ధి అధికారి లింగం ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులు ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని కులాస్‌పూర్, కంజర్ గ్రామాలలో ఎంపీడీవో విస్తృతంగా పర్యటించి గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. హరితహారం పథకం కింద మొక్కలను ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు నాటే విధంగా అధికారులు చొరవ చూపాలని అధికారులకు సూచించారు. వచ్చే వర్షాకాలం నాటికి ప్రతిగ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

ధర్పల్లి, జూన్ 5: పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాజన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభ అవార్డులను అందజేశారు. మండలంలోని వాడి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి అవార్డులను అందజేసి సన్మానించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకే తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అవార్డులను అందజేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ నితిన్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

పెద్దబజార్, జూన్ 5: వాసవీ జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త హాజరయ్యారు. పేద ఆర్యవైశ్య విద్యార్థులకు నర్సరీ నుంచి డిగ్రీ విద్యార్థులకు వారి తరగతి ప్రకారం పుస్తకాలతో పాటు 130 స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాందేవ్‌వాడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్త, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ సిందూర మాణిక్యం గుప్త, సాయిప్రసాద్, లక్ష్మణ్, నితిన్‌కుమార్, కాపర్తి భారత్, ఆర్యవైశ్యుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,700	రూ.67,000	రూ.910

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గంగం గణేషా (1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-2 : భజే వాయువేగం (1.35, 7.35)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (4.30, 10.30)
స్క్రీన్-3 : భజే వాయువేగం (11.10, 10.40)
: సవి (హిందీ) (2.05, 7.55)
: చోట భీమ్ (హిందీ) (4.50)
స్క్రీన్-4 : ఫ్యూరియోసా (1.30)
: లవ్‌మీ (4.45, 10.30)
: హిట్ లిస్ట్ (7.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : భజే వాయువేగం (10.40)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.20, 10.30)
: గంగం గణేషా (4.30)
స్క్రీన్-2 : గంగం గణేషా (10.45, 1.45, 7.30)
: భజే వాయువేగం (4.40, 10.30)

దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హిట్‌లిస్ట్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : లవ్‌మీ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్